అసౌకర్యాల 'అడెల్లి'

- నాలాలు పూడ్చి ఇష్టానుసారం నిర్మాణాలు
- కంపు కొడుతున్న మహాపోచమ్మ ఆలయ పరిసరాలు
- ఎక్కడికక్కడ నిలుస్తున్న మురుగునీరు
- ఇబ్బంది పడుతున్న భక్తులు


కోనేరు నుంచి మురుగునీరు వెళ్లే ప్రదేశంలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు

సారంగపూర్: జిల్లాలోనే పేరుగాంచిన సారంగపూర్ మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయం కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. అడెల్లి ఆలయానికి ఏటా హుండీల ద్వారానే సుమారు రూ.80 లక్షల పైనే ఆదాయం వస్తున్నా.. సౌకర్యాల కల్పనకు నోచుకోవడం లేదు. దుకాణాల వేలం, ఆభరణాలు, వివిధ మార్గాల్లో టెండర్ల ద్వారా వచ్చే ఆదాయం దీనికి అదనం. ఆలయ నిర్వహణ సరిగా లేక మురుగునీరు చేరి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు నిలువకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కల్వర్టులు పూడ్చివేయడంతోనే సమస్య..

ఆలయానికి ప్రతి ఆదివారం వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. ఆరుబయట చెట్ల కింద సేదతీరుదామనుకుంటే ఎక్కడికక్కడ మురుగునీరే దర్శనమిస్తోంది. ఆలయం చుట్టుపక్కల ప్రైవేటు వ్యక్తులు తమ భూముల్లో అద్దెగదులు, వాటర్‌ప్లాంట్లు నిర్మించుకొని ఎక్కడికక్కడ మొరం పోయించి నాలాలను పూడ్చివేశారు. దీంతో కోనేరు వద్ద భక్తులు స్నానం చేసిన నీరు, వర్షపునీరు, ఇతర అవసరాలకు ఉపయోగించిన నీరు ముందుకు వెళ్లలేక పరిసరాలు కంపు కొడుతున్నాయి. గతంలో ఆలయ పరిసరాల్లోని భూముల్లో పంటలు పండించేవారు. అప్పుడు మురుగునీరు, వర్షపునీరు నేరుగా నాలాల ద్వారా వెళ్లిపోయేది. కానీ కొందరు తమ భూముల్లో మొరం పోయించి పలు నిర్మాణాలు చేపడుతుండటంతో మురుగునీరు ముందుకు వెళ్లలేక కోనేరు పరిసరాల్లోనే నిలుస్తోంది. దీంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు ఈగలు, దోమలు పెరుగుతున్నాయి. నాలాలు లేకుండా అధికారులు నిర్మాణాలకు ఎలా అనుమతులు ఇస్తున్నారంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు.

మాస్టర్ ప్లాన్‌తో పరిస్థితి మారేనా..

రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 2022లో ఆలయాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. దీనికి అనుగుణంగా 2023లో రూ.10కోట్ల నిధులతో ఆలయ పునర్నిర్మాణం, మాస్టర్‌ప్లాన్ పనులు చేపట్టారు. ప్రస్తుతం రూ.6కోట్లతో ఆలయం అందంగా రూపుదిద్దుకుంది. ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో షాపింగ్ కాంప్లెక్స్, మురుగు కాలువలు, సీసీరోడ్లు ఉన్నట్లు తెలుస్తోంది. నాలాలు పూడ్చివేయడంతో మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మిగతా పనులు చేపట్టినా పరిస్థితి మారదని భక్తులు విమర్శిస్తున్నారు.

పరిష్కరించాల్సిన సమస్యలు..	
ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా శుభ్రం చేయడం	మట్టితో పూడ్చిన నాలాలను తవ్వి నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవడం

రూ.65లక్షలతో నివేదిక పంపించాం

ఆలయ పరిసరాల్లో భూములున్న ప్రైవేటు వ్యక్తులు మొరం పోసి నాలాలను పూడ్చివేయడంతో వర్షపునీరు బయటకు వెళ్లడం లేదు. ఈవిషయం ఆర్‌అండ్‌బీ అధికారులకు వివరించాం. వారు వచ్చి పరిశీలించి రూ.65లక్షలతో నివేదిక సిద్ధం చేసి మాకు పంపించారు. దీనికి నిధులు మంజూరు కాలేదు. మురుగు కాలువలు నిర్మించి వరద కాల్వకు అనుసంధానిస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

– రమేశ్, ఆలయ ఈవో


నీరు వెళ్లకుండా మొరంతో పూడ్చిన కల్వర్టు


అద్దెగదుల వెనుక మైదానంలో నిలిచిన నీరు

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌తో మేక మృతి

సారంగపూర్: మండలంలోని ధని గ్రామంలో చిగుర్ల రవికి చెందిన మేక శనివారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. బాధితుడి వివరాల ప్రకారం మేకల మందను మేత కోసం గ్రామ సమీపంలోకి తోలుకెళ్లగా.. అక్కడ మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా అవుతున్న తీగలకు తగిలి మృతి చెందింది. జేఎల్‌ఎం సంపత్ ఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ సరఫరా నిలిపివేయించాడు. మేక విలువ సుమారు రూ.10వేలు ఉంటుందని.. పరిహారమిచ్చి ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యే బొజ్జును సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: పీసీసీకి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండోసారి నియమితులైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో బొజ్జును మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, సురేశ్, భీమేశ్ తదితరులు ఉన్నారు.

రేపు రక్తదాన శిబిరం

ఖానాపూర్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 16న సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. రక్తదానం చేసేందుకు ఆసక్తి గల వారు క్యాంపు కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

ముధోల్: మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) కార్యాలయంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. శనివారం ముధోల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పొటాష్ బస్తా ధర రూ.1880, 20–20 బస్తా ధర రూ.1280 ఉందని.. ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాలతో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఎరువుల కొరత లేకుండా రైతులకు అన్ని అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ


ముగ్గు పోసిన కమిటీ సభ్యులు

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో 32 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. శనివారం ఐదుగురు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ కమిటీ సభ్యులు ముగ్గు పోశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యోగేష్, కమిటీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, కర్ల బక్కయ్య, ఫాతిమా, యూనుస్, జగదీశ్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో ఇక్కట్లు


మరమ్మతులు పరిశీలిస్తున్న ఏఈ రాంసింగ్

ఖానాపూర్: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రకటించిన అధికారులు మరో రెండు గంటలు అదనంగా విద్యుత్ కోతలు విధించారు. విద్యుత్ సాయంతో పనులు చేసే వినియోగదారులకు ఇబ్బందులు తప్పలేదు. పలువురు ఏఈ రాంసింగ్‌కు ఫోన్ చేయడంతో ఆయన ఖానాపూర్‌కు వచ్చి మరమ్మతులు పరిశీలించారు.

అత్తింటి వేధింపులతో నవవధువు ఆత్మహత్య

- వివాహం జరిగిన మూడు నెలలకే ఘటన
- ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మిన్నంటిన కుటుంబసభ్యుల రోదనలు


శైలజ (ఫైల్)

ఖానాపూర్: పెళ్లైన మూడు నెలలకే భర్త, అత్త, బంధువులు అనుమానించడం, అదనపు కట్నం కోసం వేధించడంతో నవవధువు ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన దండుగుల నర్సవ్వ–పోషన్న దంపతుల చిన్న కూతురు శైలజ (19)కు అదే గ్రామంలో ని ఎస్సీ కాలనీలో నివాసముండే అల్లెపు గంగు–చి న్నయ్య దంపతుల కుమారుడు రాజేశ్వర్‌తో గత మార్చి 6న వివాహం చేశారు. పెళ్లైన నెల రోజుల నుంచి భర్త రాజేశ్వర్, అత్త గంగు, ఇతర బంధువులు శైలజపై అనుమానం పెంచుకోవడంతోపాటు అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురి చేశారు. ఈ క్రమంలో శనివారం శైలజ అత్తవారింట్లోనే గది లో చీరె, చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్ప డింది. శైలజ తల్లి నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఖానాపూర్ ఆస్పత్రి ఆవరణలో కుటుంబీకులతో నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా, తహసీల్దార్ సుజాత మాట్లాడి శైలజ ఆత్మహత్యకు కారణాలు తెలుసుకున్నారు. పో స్టుమార్టం గదిలోని ఆమె మృతదేహాన్ని పరిశీలించారు. కాగా, పెళ్లైన మూడు నెలలకే ప్రాణాలు తీసుకునేలా శైలజను అత్తింటివారు వేధించారని మృతురాలి తల్లి నర్సవ్వ, అక్క ప్రేమలత ఆరోపించారు. ఆస్పత్రి ఆవరణలో వారు రోదిస్తున్న తీరు కలిచివేసింది.


రోదిస్తున్న యువతి తల్లి, కుటుంబీకులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని శివారులో 61వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నర్సాపూర్(జి) మండలంలోని చాక్‌పల్లి పంచాయతీ పరిధిలోని డొంగుర్గాం గ్రామానికి చెందిన జంగిపెల్లి నర్సయ్య అనే యువకుడు బైక్‌పై నిర్మల్ వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలవగా కాలు విరిగి రోడ్డు పక్కన పడిపోయాడు. బైక్ టైరు ఊడిపోయింది. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబసభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.


గాయపడిన జి. నర్సయ్య


గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో దెబ్బతిన్న బైక్

పురుగుల మందు తాగి ఆత్మహత్య

కుభీర్: మండలంలోని మాలేగాం గ్రామానికి చెందిన అవునూరి తుకారాం (45) అనే రైతు శనివారం మధ్యాహ్నం తన చేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. నెలరోజుల కిందట గ్రామానికే చెందిన ఓ వ్యక్తి తన చేనులో నీళ్లు పడటం లేదని తుకారంను అడిగి వారి చేనులో బోరు వేసుకోగా నీళ్లు బాగా పడ్డాయి. ఈ విషయం మృతుడి భార్యకు తెలియడంతో గొడవ జరిగింది. బోరును తుకారాంకే అప్పగించి వేసిన ఖర్చులు ఇవ్వాలని పెద్దమనుషులు నిర్ణయించారు. తరచుగా మద్యం తీసుకునే అలవాటు ఉన్న తుకారం.. శనివారం తాగిన మైకంలో పురుగుల మందు తాగి చనిపోయాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతడి భార్య గంగామణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'దస్తురాబాద్ మత్స్యకారులకు న్యాయం చేయండి'

నిర్మల్‌టౌన్: దస్తురాబాద్ మత్స్యకారులకు న్యాయం చేయాలని జిల్లా గంగపుత్రుల సంఘం నాయకులు కోరారు. శనివారం వారు జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. దస్తురాబాద్ గంగపుత్రులకు మత్స్యశాఖ ఏడీ అన్ని అనుమతులిచ్చినా గోదావరిలోని చింతమడుగులో చేపలు పట్టకుండా రాంపూర్ గ్రామ మత్స్యకారులు అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగడం లేదన్నారు. అధికారుల నుంచి రాజకీయ పార్టీ నాయకుల వరకు దస్తురాబాద్ మత్స్యకారుల మీద వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. చేపలు పట్టనియకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఇందులో గంగపుత్రులు ఉన్నారు.

పాఠశాలకు విరాళం అందజేత

భైంసాటౌన్: పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రజోత్ కుమార్ కులకర్ణి శనివారం రూ.50వేలను విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం తన వంతుగా సాయం అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయనను పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోపాల్ కిషన్, ప్రబంధకారిణి సభ్యులు శివకుమార్ బచ్చువార్, తోట రాము, రాజేశ్వర్, హెచ్‌ఎం గంగాధర్ తదితరులు ఉన్నారు.


విరాళం అందిస్తున్న ప్రజోత్ కుమార్

సాగు భూములకు పట్టాలిస్తాం


గిరిజనులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకర్

కడెం: రాంపూర్, మైసంపేట్ గిరిజనులకు పునరావాస ప్యాకేజీలో భాగంగా పంపిణీ చేసిన సాగు భూములకు 15 రోజుల్లో రెవెన్యూ పట్టా లిస్తామని తహసీల్దార్ ఆర్.ప్రభాకర్ తెలిపా రు. పునరావాస కాలనీలో ఎఫ్‌ఆర్వో గీతారాణితో కలిసి గిరిజనులతో శనివారం సమావేశం నిర్వహించారు. 94 మంది లబ్ధిదారుల్లో 70 మందికి 15 రోజుల్లో అందిస్తామని, మరణించినవారివి, తప్పులు ఉన్న మిగతావి సరిచేసి త్వరలోనే అందజేస్తామని వెల్లడించారు.

23న చలో కలెక్టరేట్

నిర్మల్‌చైన్‌గేట్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 23న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు పెన్షనర్ల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంసీ.లింగన్న తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఉదయం 11 గంటలకు పెన్షనర్ సంఘ భవనం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామని పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌కు స్పందన

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలోని కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి స్పందన వచ్చిందని కోర్టు లైజనింగ్ అధికారి మణిరాం ఓ ప్రకటనలో తెలిపారు. జడ్జిలు రవీందర్, భవిష్య ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన 50 కేసులను పరిష్కరించారు. 275 డ్రంకన్ డ్రైవ్ కేసులను పరిష్కరించగా రూ.3 లక్షల 50వేలు జరిమానా రూపంలో వసూలైనట్లు పేర్కొన్నారు.

విద్యార్థికి సన్మానం

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన ఏఈవో గణేశ్–సరస్వతి దంపతుల కుమారుడు రవితేజ ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చాడు. ఆలిండియా స్థాయిలో 638వ ర్యాంకు సాధించాడు. దీంతో శనివారం గ్రామస్తులు విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దిగంబర్ పటేల్, సాయి శ్రీనివాస్, దశరథ్, లస్మన్న, వెంకటి, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలకు కార్మికులు తరలిరావాలి

సారంగపూర్: నిజామాబాద్‌లో ఈనెల 21. 22 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర మహాసభలకు కార్మికులు హాజరు కావాలని యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) రాష్ట్ర కార్యదర్శి రాజన్న అన్నారు. శనివారం మండలంలోని ఆలూర్ ఎక్స్‌రోడ్డు వద్ద బీడీ కంపెనీ ఫ్యాక్టరీ వద్ద టీయూసీఐ రాష్ట్ర ప్రథమ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు, హక్కుల సాధనకు చేపట్టాల్సిన విధి విధానాల గురించి మహాసభల్లో చర్చిస్తారని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు, హోటళ్లు, గోదాం, ఇతర అనేక రంగాల్లో పని చేసే కార్మికులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

జూలై 9న సార్వత్రిక సమ్మె

నిర్మల్‌చైన్‌గేట్: కార్మిక చట్టాల పరిరక్షణ, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె తలపెట్టినట్లు సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో సీఐటీయూ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సార్వత్రిక సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల అస్తిత్వానికి అత్యంత ప్రమాదకరమన్నారు. కార్మిక చట్టాల పరిరక్షణకు 11 జాతీయ కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్‌లు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. అనేక పోరాటాల ఫలితంగా వచ్చిన 29 కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. ఈ కోడ్‌ల ప్రకారం రోజుకు 12 గంటలు పని చేయాలని, యజమానికి ఇష్టమైన న్ని రోజులు పని చేయించుకుని, ఉన్న ఫలంగా పనిలో నుంచి తొలగించవచ్చన్నారు. యూనియన్ పెట్టుకునే హక్కు లేకుండా పోతుందని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాలను కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. సమరశీల ఉద్యమాలు, పోరాటాలు, సమ్మెతో పాలకుల మెడలు వంచాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గంగమణి, జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్, జిల్లా కమిటీ సభ్యులు శైలజ, చంద్రకళ, ఆశ వర్కర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.సుజాత, ఉపాధ్యక్షులు నంద, అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు లావణ్య, భాగ్య పాల్గొన్నారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

భీమన్న ఆలయ వార్షికోత్సవం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని కురన్నపేట్ కాలనీలో భీమన్న ఆలయ ఐదో వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ పూజలు చేశారు. భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రాజేశ్వర్, ధర్మరాజు, గోవర్ధన్, రమేశ్, చంద్రశేఖర్ ఉన్నారు.

కేంద్ర పథకాలు వివరించాలి

భైంసాటౌన్: భారత ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీజేపీ మండలాధ్యక్షురాలు సుష్మరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో నిర్వహించిన మండలస్థాయి వికసిత్ భారత్ సంకల్ప సభలో ఆమె మాట్లాడారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు సాయినాథ్, ఆకాశ్, నాయకులు అశోక్, మహేందర్, సత్యనారాయణరెడ్డి, రాజేశ్వర్, సుధాకర్ పాల్గొన్నారు.

ఈరోజు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: టౌన్–3 పరిధిలోని 33/11 కేవీ దివ్యనగర్ సబ్‌స్టేషన్ నెలవారీ మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యనగర్, దత్తాత్రేయనగర్, ఏఎన్‌రెడ్డి కాలనీ, శాస్త్రీనగర్, శాంతినగర్, శ్రీనగర్ కాలనీ, బ్రహ్మపు రి, షేక్‌షాయి పేట్, వెంకటాద్రి పేట్, గుల్జార్ మార్కెట్, గాయత్రి టౌన్ షిప్ ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కుంటాలలో బీజేపీ మండలస్థాయి సమావేశం

కుంటాల: మండల బీజేపీ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు కుంటాలలోని యాదవ సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ కన్వీనర్ పసుల నవీన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హాజరవుతారని.. కార్యకర్తలు సకాలంలో రావాలని ఆయన కోరారు.

దెబ్బతిన్న కల్వర్టు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, ధర్మోర గ్రామాల నుంచి వచ్చే మురుగునీరు శివారు ప్రాంతాల్లోకి వెళ్లేందుకు పంచగుడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై కల్వర్టు నిర్మించారు. భారీ వాహనాల రాకపోకలతో కల్వర్టు పైపులు దెబ్బతిని రోడ్డుపై గుంత ఏర్పడింది. ఈ గుంతలో పంచాయతీ అధికారి మొరం పోయించడంతో మురుగునీరు ముందుకెళ్లడం లేదు. అధికారులు కల్వర్టు నిర్మించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


కల్వర్టు దెబ్బతినడంతో నిలుస్తున్న మురుగునీరు

సాగు పనులు షురూ..

కుంటాల మండలం ఓలా శివారులో మక్క విత్తనాలు వేస్తున్న రైతులు



కుంటాల మండలం కల్లూరులో యూరియా మోసుకెళ్తున్న రైతు



వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సాగు పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే జిల్లాలో కొన్నిచోట్ల పత్తి, సోయాబీన్, మొక్కజొన్న విత్తనాలు విత్తుతుండగా మరికొన్ని చోట్ల దుక్కులను సిద్ధం చేసుకుంటున్నారు. రైతులు సాగు పనులు చేస్తున్న దృశ్యాలివీ. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


ఓలా శివారులో పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళలు


దిలావర్‌పూర్ మండలకేంద్రం శివారులో ఓ చేను వద్ద బోరు రిపేర్ చేస్తున్న రైతులు